క్లుప్తంగా

హైందవ శంఖారావంపై ఇంటింటా ప్రచారం



సిరిపురంలో ప్రచారం చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ సిరిపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని గీతాశ్రమం ఆధ్వర్యంలో మహిళలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ఆలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ధార్మిక సంస్థలకు అప్పగించాలని, దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ మండలాల వారీగా సభలు నిర్వహిస్తామన్నారు. హైందవ శంఖారావం సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి హిందూ ఐక్యతను చాటాలని కోరారు. అనంతరం శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు కొల్లా శ్రీనివాస్, ఆకుల నూకపతిరావు, ఉంగాల బూరయ్య, మజ్జూరి వెంకటలక్ష్మి, సోము సూర్యావతి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గండేపల్లి: మండలంలోని మురారి మామిడితోటల్లో వేంచేసిన కనకదుర్గ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మరో రెండు రోజుల్లో అమ్మవారి జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి వేకువజామునే భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. వంట వార్పు చేసుకుని అక్కడే భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మామిడితోటలో ఆటపాటలతో సందడిగా గడిపారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని మురారి, గండేపల్లి, మల్లేపల్లి తదితర గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. జాతరకు వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లల్లో పోలీసులు, నిర్వాహకులు నిమగ్నమయ్యారు.

నేడు కృష్ణాపురంలో రెవెన్యూ సదస్సు

తొండంగి: రైతుల సమస్యల పరిష్కారం కోసం మండలంలోని కృష్ణాపురంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మురార్జీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రైతులు తమ భూసమస్యలు, కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

ఏలేశ్వరం మండల అధికారులు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎంపీడీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

చలించకుంటే కష్టమే !

- గ్రామాల్లో పెరుగుతున్న చలితీవ్రత
- ఉన్ని దుస్తులకు పెరుగుతున్న డిమాండ్
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్య నిపుణులు



గోకవరంలో ప్రధాన రహదారి చెంతనే ఉన్ని దుస్తుల విక్రయాలు

గోకవరం: మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది చలితీవ్రత పెరిగింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉండటంతో గోకవరం, జగ్గంపేట మండలాల్లో శీతలగాలుల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. రాత్రి సమయంతో పాటు పగటి ఉష్ణోగ్రతలు సైతం తక్కువగా నమోదు కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో రాత్రి సమయంలో నెగడు వేసుకుని వెచ్చబడుతున్నారు. చల్లగాలులకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, గర్భిణులు పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శీతాకాలంలో పలు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చలిగాలిలో తిరిగితే ఊపిరితిత్తుల సమస్య, చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వీరు మంచులో గడిపితే ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరి ఇన్ఫెక్షన్‌కు దారి తీస్తుంది. ఎండ వచ్చే వరకూ బయటకు రాకూడదు. సాయంత్రం ఆరు దాటిన తరువాత బయటకు వెళ్లకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే చెవులకు, ముక్కుకు చలిగాలి తగలకుండా మాస్కులు ధరించాలి. అలాగే శీతలగాలులకు చర్మం పొడిబారి చర్మవ్యాధులు పెరిగే అవకాశం ఉంది. చలి మంటలో శరీరం కాచుకోకూడదు. దీనివలన చర్మం మరింత పొడిబారుతుంది. చర్మం పొడిబారకుండా ఉండటానికి నూనె, మాయిశ్చరైజర్లు వంటి క్రీములు రాసుకోవాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులు చలిగాలుల్లో తిరగరాదని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో ఉన్ని దుస్తులు ధరించాలి. ఉన్ని దుస్తుల వలన అలర్జీ వచ్చే అవకాశం ఉన్నందున తరచూ ఎండలో ఆరబెట్టాలి. అలాగే వాకింగ్, జాగింగ్ చేసే వారు పలు జాగ్రత్తలు పాటించాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా శీతకాలంలో వ్యాధుల బారిన పడకుండా ఉండే అవకాశం ఉంది.

జోరందుకున్న ఉన్ని వస్త్రాల అమ్మకాలు

శీతాకాలం కావడంతో మండల కేంద్రాల్లో ఉన్ని వస్త్రాల అమ్మకాలు జోరందుకున్నాయి. మెట్ట ప్రాంతమైన జగ్గంపేట, గోకవరం గ్రామాలతో పాటు గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లోని జాతీయ రహదారి వెంబడి ఉన్ని వస్త్రాల దుకాణాలు వెలిశాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యాపారస్తులు దుకాణాలు తెరిచి రకరకాల స్వెట్టర్లు, రగ్గులు, మఫ్లర్లు, శాలువాలు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌ల అమ్మకాలు చేపట్టారు. చలిప్రభావంతో ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. గత రెండేళ్లుగా రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం సాగిస్తున్నామని, చలిప్రభావం ఎక్కువగా ఉండటంతో వ్యాపారం లాభాసాటిగా ఉందని ఉన్ని వస్త్రాల వ్యాపారులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుత శీతాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉన్ని దుస్తులను ఎక్కువగా వినియోగించాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా చూసుకోవాలి. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వేడి ఆహార పదార్థాలను, పౌష్టికాహారం తీసుకోవాలి. శ్వాస సమస్యలు ఉన్న వారు చలిగాలుల్లో తిరగరాదు.

– డాక్టర్ వనజాకుమారి, సూపరింటిండెంట్, గోకవరం సీహెచ్‌సీ

200 మందికి కంటి పరీక్షలు



ఏలేశ్వరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు ప్రారంభించారు. సాయిశంకర్ నేత్రాలయం వైద్యుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 30 మందికి శస్త్ర చికిత్సల నిమిత్తం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. రోగులకు ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కంటిచూపు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు జ్యోతుల శ్రీనివాస్, పూర రాజబాబు, అలమండ దుర్గావెంకటప్రసాద్, కప్పల నాగభూషణం, గొల్లపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు



కలశాలలో పంచామృతాలకు పూజలు చేస్తున్న పండితులు, భక్తులు

- వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు
- వచ్చే నెల 10న ఉత్తర ద్వార దర్శనం

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి జనవరి 13 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లు, పరివార దేవతలకు అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 16న ఉదయం 6.44 గంటలకు నెల గంట (గంట పూజ), జనవరి 1న పూలంగి సేవ, శ్రీపుష్పయాగం, 3న తిరుప్పవడ సేవ, అన్నసమారాధన, సహస్ర దీపాలంకర సేవ, 8న స్వామివారికి పంచహారతుల సమర్పణ, గోపూజ నిర్వహిస్తామన్నారు. 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 11న పాయశం నివేదన, 12న అమ్మవారి సారే ఊరేగింపు, మంగళస్నానం, 13న భోగి పండగ, గోదారంగనాథుల దివ్య కల్యాణ మహోత్సవం, 14న మకర సంక్రాంతి పర్వదినంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ధర్మకర్తలు పేర్కొన్నారు. తపోవనం ఆశ్రమంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి తెలిపారు.

జి.కొత్తపల్లిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ముద్రగడను కలసిన రాజ్యసభ సభ్యుడు బోస్



కిర్లంపూడిలో ముద్రగడను, గిరిబాబును కలిసిన బోస్

కిర్లంపూడి: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆదివారం మాజీ మంత్రి, ఆ పార్టీ నాయకుడు ముద్రగడ పద్మనాభాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ముద్రగడను, ఆయన కుమారుడు గిరిబాబును కలిసి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ నేత మురళీరాజు, జేఏసీ నాయకులు గౌతుస్వామి పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు



ఏలేశ్వరం లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న యూత్ సభ్యులు

ఏలేశ్వరం: క్రిస్మస్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక కాలేజ్ రోడ్డులోని లూథరన్ చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల్లో కొవ్వొత్తుల ప్రార్థనలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు గణేష్, పేకల జాన్, ఉదయ్‌కుమార్, యూత్ సభ్యులు షర్మిల రతన్, రీనిజెమీమా, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



కిత్తుమూరిపేటలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని కిత్తుమూరిపేటలో బాధిత కుటుంబాలను ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక చేయూతను అందించారు. గ్రామానికి చెందిన వేట్ల వీరవెంకట సత్యనారాయణ కుమార్తె కోరాపు వెంకమ్మ, మోడోజు నాగరాజు, మోడోజు రాజేశ్వరిలతో పాటు మరో రెండు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ప్రతి ఒక్కరిని తమ ట్రస్టు ద్వారా ఆదుకుంటానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లొండ రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మాకా చంటిబాబు, దేవ లక్ష్మణ్, ఏనుగు జాన్ బాబు, విత్తనాల నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై ప్రత్యంగిర హోమం పూర్ణాహుతిలో పాల్గొన్న ఈఓ సుబ్బారావు, అధికారులు

అన్నవరం: మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. వనదుర్గ అమ్మవారి ఆలయం దిగువన గల మండపంలో ఉదయం తొమ్మిది గంటలకు పండితులు ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, గంగబాబు ఘనపాఠి, వంశీ, వేణు, కూచుమంచి ప్రసాద్, చెల్లపిళ్ల ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ వి. సుబ్బారావు, ఈఈ రామకృష్ణ, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణతో పాటు మొత్తం 50 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



గోకవరం దేవీచౌక్ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. అనంతరం కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆదర్శప్రాయుడు అమరజీవి

- గ్రామాల్లో పొట్టిశ్రీరాములు వర్ధంతి
- విగ్రహాలకు నివాళులర్పించిన నేతలు



ప్రత్తిపాడులో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్



తొండంగిలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



ఏలేశ్వరంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఏలేశ్వరం: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నేతలు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు శ్రీరాములు చేసిన కృషి రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పతివాడ జగదీష్, కావలి శ్రీను, కొత్తపల్లి రవి, ఆర్యవైశ్యులు మామిడిపాక సతీష్, కొత్త దత్తుడు, వాగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: గ్రామంలోని ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవి క్లబ్, వనిత క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పినిశెట్టి ప్రకాష్, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, తుని మార్కెట్ యార్డ్ మాజీ వైస్‌చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు నూకాలమ్మగుడి ప్రాంతంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ ఆర్యవైశ్య సంఘ సభ్యులు వెలగా రాజబాబు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

తుని: రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక పాత బజారువీధిలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. అమరజీవి విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, కుసుమంచి సుబ్బరాయులు, పేరూరి కృష్ణ, పామర్తి మహేష్, శంకర్రావు, మోహన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తొండంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఆర్ఐ రాజారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోటనందూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు



తునిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు